సరస్వతిపూజలో పాల్గొన్న ఎంపీపీ దాసు

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం జింకిభద్ర గ్రామంలో జరుగుతున్న సరస్వతిదేవి నవరాత్రుల్లో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు శుక్రవారం పాలొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని తన సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి శేఖర్, పోకల బాబూరావు, దిలీప్, శ్రీనివాస్‌పాణిగ్రాహి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ వాగులు ఆక్రమణ వలనే ముంపు తీవ్రత

కనుమరుగైన సీత గెడ్డ.. ఆందోళనలో రైతాంగం

విశాలాంధ్ర - టెక్కలి : వాయుగుండం ప్రభావంతో గురువారం కురిసిన భారీ వర్షానికి టెక్కలి మండలంలో లోతట్టు గ్రామాలు జలమయం అయ్యాయి. టెక్కలి మండలం పాతనౌపడ, పెద్దరోకలపల్లి పంచాయితీల పరిధిన గల జండాపేట, సింగిమహంతి పేట, బంజీరు పేట, పెద్దరోకళ్ల పల్లి, సీతారాంపల్లి, రాళ్ళ పేట, దెప్పినౌపడ, నాయుడు పేట గ్రామాలతో పాటు సీతానగరం, కస్పానౌపడ గ్రామాలకు చెందిన రైతులు వర్షపు నీరు, వరద ప్రవాహం వలన లోతట్టు ప్రాంతంలో నీరు చేరడంతో పొట్ట దశలో ఉన్న వరి పైరు నీట మునిగింది. నీటి ముంపు వలన సుమారు 500 ఎకరాలు వరి పంటకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలుస్తుంది. రైల్వే రోడ్డు నుండి జండాపేట మీదుగా ప్రవహించే సీత గెడ్డ, మోసళ్ళ గెడ్డలు రొయ్యిలు చెరువులు అక్రమ నిర్మానాలు, రైతులు కొంత మేరకు ఆక్రమించడం వలన నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పొలాల మీదకు నీరు చేరి నీటిలో వరి పంట మునిగిపోతుందని ఈ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. జండాపేట నుండి సీతానగరం వరకు గెడ్డ వాగులు ఆక్రమణలు తొలగిస్తే కొంత వరకు ముంపు సమస్య పరిస్కారం అవుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2004 - 2009 మధ్యలో 2014 -2019 మధ్య నీటి ముంపు సమయంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పర్యటించిన కింజరాపు అచ్చన్నాయుడు గెడ్డ ఆక్రమణలు తొలగించి లోతట్టు ప్రాంత రైతులకు ముంపు సమస్య లేకుండా పరిస్కారిస్తానని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు వలన ఇప్పటికే మూడు సార్లు ముంపు బారిన పడ్డామని, వరి చేను పొట్ట దశలో ఉన్నందున తీవ్ర నష్టం ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల చిత్తశుద్ధి లోపం వలన లోతట్టు ప్రాంత రైతులకు శాపంగా మారిందని వాపోతున్నారు.

జంట నదులలో పెరుగుతున్న వరద ఉధృతి

- వంశధారలో మూడవ ప్రమాద హెచ్చరిక జారీ
- నాగావళి లోనూ పెరుగుతున్న నీటి ప్రవాహం
- పరివాహక గ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : వంశధార నాగావళి జంట నదులలో వరద ఉధృతి తీవ్రరూపం దాల్చుతుంది. బంగాళా ఖాతంలోని అల్పపీడనం కారణంగా ఆమదాల వలస నరుబుజ్జిలి ఎల్ ఎన్ పేట బూర్జ మండలాలకు వంశధార నాగావళి నదీ ప్రవాహం ఉధృతం కావడంతో నదులలో నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. వంశధార లో ప్రవాహం 1.5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కిందికి విడు దల చేశారు. పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రజలను అధి కారులు అప్రమత్తం చేశారు. వంశధార పరివాహక ప్రాంతం దిగువన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసిన జిల్లా ఉన్నతాధికారులు మూడవ నెంబర్ ప్రమాద సూచిక ఎగుర్వే సినట్లు వివరించారు. దీంతో ఆయా గ్రామాలు ప్రజలను సురక్షత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సన్నద్ధ మవుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ప్రజలకు వివరిస్తున్నారు. మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులను జిల్లా ఉన్నతాధికారులు నియమించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని వారి ద్వారా తెలుసుకుంటున్నారు.

పెరుగుతున్న నాగావళి నది నీటి ప్రవాహం...
తుఫాన్ ప్రభావంతో ఒరిస్సాలో కురుస్తున్న వర్షాల కారణంగా నాగావళి నది నీటి ప్రవాహం పెరుగుతుంది. నదీ పర్యవాహక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గురువారం రాత్రి కలెక్టర్ బూర్జ మండలంలోని వారు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అధికారులను అప్రమత్తం చేశారు. గురువారం రాత్రి నాటికి 14వేల క్యూసెక్కులు నదులు నీటి ప్రవాహం ఉండగా శుక్రవారం ఉదయం నాటికి 27 వేల క్యూసెక్కులకు చేరుకుంది. శుక్రవారం రాత్రికి 35 వేల క్యూసెక్కులకు చేరుతుందని సాగునీటి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం ఉదయం కల్లా 45 వేల క్యూ సెక్కులు ప్రవాహం నదిలో ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఒరిస్సా ప్రాంతం నుంచి వేల క్యూసె క్కుల నీరు నదులులోకి చేరుతుంది. దీంతో తోటపల్లి గొట్టా బ్యారేజ్ ల ద్వారా వస్తున్న నీటిని అదే తరహాలో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే వరద ఉధృతి పెరుగుతున్న నేప థ్యంలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 24 గంటలు సమాచారం సేకరించేందుకు అక్కడ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఐతం విద్యార్థులు హ్యుందాయ్ సంస్థకు ఎంపిక



విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని స్థానిక ఐతమ్ కళాశాలలో జరిగిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఇంజనీరింగ్కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్లేస్‌మెంట్ ప్రక్రియలో ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఎంపికైన వారికి ప్రథమ వార్షిక వేతనం 5.5 లక్షల ప్యాకేజీ అందించనున్నారు. ఈ అవకాశం విద్యార్థుల కెరీర్ పురోగతికి కీలకమైన మైలురాయిగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరావు మాట్లాడుతూ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ లాంటి ప్రముఖ కంపెనీ ఈ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం గర్వకారనంగా భావించారు. విద్యార్థులు తమ ప్రతిభతో ఎంపిక కావడం ఎంతో ఆనందదాయకం అని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం తోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, డీన్ టిపిసి డాక్టర్ ఎమ్ సంతోష్ కుమార్, మరియు అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

భారీ వర్షాలకు జలమయమైన రహదారులు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : బంగాళా ఖాతంలో వాయుగుండంతో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసాయి. దీంతో మండలంలో ఉన్న పలు రహదారులు జలమయం అయ్యాయి. సంతబొమ్మాళి పాలేశ్వరం ఆలయం నుంచి దండుగొపాలాపురం మధ్య ఉన్న రహదారులు పై వరద నీరు ప్రవహించింది. బోరుభద్ర మాలగాం గ్రామాల మధ్య ఉన్న చెరువు నుంచి ప్రవహించే వరద నీరు ఉధృతికి రహదారి పాడయ్యింది. ఈదురు గాలలకు కొన్ని చోట్ల చిన్నపాటి చెట్లు నేలకొరిగాయి. ఉదయం పది గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగింది. సముద్రం తీర ప్రాంతాల్లో కల మత్యాకారులు వేట సామాగ్రి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఇంపాక్ట్ అవార్డు పొందిన రామారావు

విశాలాంధ్ర - లావేరు : ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లావేరు మండల యువకుడు శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం అప్పాపురం గ్రామానికి చెందిన యువకుడు పతివాడ రామారావు హైదరాబాద్ వారు నిర్వహించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ (వ్యక్తిత్వ వికాసం) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ద ట్రైనర్ వర్క్ షాప్ 243 బ్యాచ్ శిక్షణలో మంచి ప్రతిభ కనబరిచి ఉత్తమ ట్రైనర్ సర్టిఫికెట్ను అందుకున్నారు. 35 రోజులు పాటు ఆన్లైన్ జూమ్ క్లాసులో ఉచితంగా వ్యక్తిత్వ వికాస పాఠాలు అభ్యసించిన ఆయన అనంతరం రెండు రోజులు పాటు హైదరాబాదులో జరిగిన ఆఫ్లైన్ శిక్షణలో లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో తన ప్రతిభను ప్రదర్శించారు. శిక్షణ ముగింపులో ఇంపాక్ట్ ఫౌండర్ గురూజీ గంపా నాగేశ్వరరావు స్వయంగా సర్టిఫికెట్ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారు. అలాంటివారికి సరైన దిశలో మార్గ నిర్దేశం చేసి తమ శక్తిపై నమ్మకం పెంపొందించి ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకెళ్లడం కోసం ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హెడ్ సుధీర్ బంధం రావూరి మాట్లాడుతూ ఎవరైనా నీ గురించి మాట్లాడుతున్నప్పుడు దాన్ని స్వీకరించే విధానమే నీ విలువను పెంచుతుంది సందర్భాన్ని తగ్గట్టు మాట్లాడే విధానం, అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ప్రెసిడెంట్ త్రినాధ , ఇంచార్జ్ సాయి అపేక్ష, ఇన్చార్జ్ కొలిపాక నాగలక్ష్మి, కోఆర్డినేటర్ అరవింద మెంటర్ ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు. ఇంటికొక స్పీకర్ ఊరుకు ఒక ట్రైనర్ అనే నినాదంతో ముందుకు వెళుతున్న ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ కోర్సులు పూర్తిగా ఉచితము అని ఇవి యువత వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడమే కాక సమాజంలో శక్తివంతమైన వ్యక్తులుగా ఎదగడానికి మార్గం చూపుతాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. వివరాలకు కింద ఉన్న నెంబరుకు సంప్రదించ్చని 970 154 2996 కోరారు.

కార్మికుడిని కాపాడిన బారువ పోలీసులు

మహేంద్రతనయ నదిలో కొట్టుకుపోయిన వైనం

విశాలాంధ్ర - సోంపేట : గత రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు సోంపేట మండలం మహేంద్రతనయ నదిలో కొట్టుకుపోయిన ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ కార్మికుడిని బారువ పోలీసులు సురక్షితంగా కాపాడిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే బుధవారం రాత్రి నుంచి మొదలైన భారీ వర్షాలకు మండలంలో మహేంద్రతనయ నది భారీగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ పరిస్థితుల్లో మూలపొలం గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెన పనులకు వచ్చిన ఒడిశా రాష్ట్రం బంజిబాల్ చిల్పడ గ్రామానికి చెందిన నవీన్ మాజీ అనే కార్మికుడు ప్రమాదవశాత్తు నదిలో కొట్టుకుపోయాడు. ప్రాణాపాయస్థితిలో అదృష్టవశాత్తు నది ఒడ్డున గల ఓ స్తంభానికి పట్టుకుని ఉండగా గమనించిన స్థానికులు బారువ ఎస్సై హరిబాబునాయుడుకు సమాచారం అందజేశారు. వెంటనే ఎస్సై హరిబాబునాయుడు పోలీస్ సిబ్బందిని బారువ మెరైన్ పోలీసులను వెంటబెట్టుకుని ఘటనా స్థలానికి వెళ్లారు. ఒకవైపు ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు, మరోవైపు అందులో ప్రాణాపాయస్థితిలో ఉన్న కార్మికుడును గమనించి చాకచక్యంగా ప్రాణాలు పణంగా పెట్టి ధైర్యసాహసాలతో పోలీసులు కార్మికుడిని పట్టుకుని బయటకు తీసుకు వచ్చారు. అక్కడ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. శుక్రవారం సదరు కార్మికుడు చక్కగా తేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న బారువ పోలీసులను మెరైన్ పోలీస్ సీఐ హరిబాబునాయుడు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఆ కుటుంబానికి తిరిగి జీవం ప్రసాదించిన ఈ ఘనత బారువ పోలీసులకు బారువ మెరైన్ పోలీసులకు దక్కుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవోలతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : బంగాళాఖాతం అల్పపీడనం కారణంగా ఎగువన ఉన్న ఒడిస్సా తోపాటు తపాతపట్నం నియోజకవర్గంలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు మహేంద్ర తనయ, వంశధార నదులు ఉప్పొంగి నదీ పరిసర గ్రామాలు జలమయం కావడంతో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వరరెడ్డి, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తదితర ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి వరద ప్రభావిత గ్రామాలైన గొట్ట, వసప, నివగాం, పెనుగొటివాడ, మాతల తదితర గ్రామాలను పరిశీలించిన పాతపట్నం నియోజకవర్గశాసన సభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు గురువారం పరిశీలన చేశారు. నియోజక వర్గంలోని ఐదు మండలాల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేసి వరద ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వరద ప్రభావం వలన నష్టపోయిన పంటలకు గాను ప్రభుత్వమే ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు.

మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం / పాతపట్నం : గురువారం పాతపట్నం నియోజకవర్గం శాసన సభ్యులు మామిడి గోవింద రావు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్థానిక సిహెచ్ కేంద్రం వద్దగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం, సత్యం, శాంతి సిద్ధాంతాలు నేటికీ సమాజానికి వెలుగు చూపుతున్నాయన్నారు. ఆయన ఆలోచనలు తరతరాలకు మార్గదర్శకం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల గూర్చి గ్రామసభ



విశాలాంధ్ర - హిరమండలం : రానున్న 2026 ఆర్థిక సంత్సర జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు గూర్చి శుక్రవారం ఎన్ ఆర్ ఈజిఎస్ కార్యాలయంలో హిరమండలం మేజర్ పంచాయతీ గ్రామ సభను సర్పంచ్ దేవుదల సుందరమ్మ అధ్యక్షతన ఈఓ మూల భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హిరమండలం పంచాయతీకి, ఆర్‌టిసి పంచాయతీ కి సుబలయ కు ఎక్కడెక్కడ పనులు చెయ్యాలో ప్రతి పాదనలు అందజేయాలనీ ఉపాధి హామీ అధికారులు తెలియ జేశారు. ఉపాధి హామీ మేట్ లు దాదాపు గా 10 మంది వరకు గైర్హాజరవడంతో ఈఓ ఎం భాస్కర్ రావు మండి పడ్డారు. వేతనదారుల మస్టర్ లో అవకతవకలు లేకుండా ప్రభుత్వ వేతన దారుల ముఖంకి ఫొటో తీసి మస్టర్ వేయడం జరుగు తుందని ఉపాధి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.సుందరమ్మ, ఎంపీటీసీ ప్రతి నిధి మీసాల రామకృష్ణ, ఆర్టీసీ ఆర్ అండ్ ఆర్ సర్పంచ్ ప్రతి నిధి యాందవ ప్రసాద్, ఎంపీటీసీ తట్ల శంకర్ రావు, వై తవిటయ్య వార్డు సభ్యులు తోనింగ్ తవుడు, పుప్పాల మురళి, సమేన కృష్ణ ఉపాధి వేతనదారులు తదితరులు పాల్గొన్నారు.

నేటికీ..ఏనాటికీ స్ఫూర్తిప్రదాత మహాత్మా గాంధీ

విశాలాంధ్ర - పోలాకి : నేటికీ, ఏనాటికైనా స్ఫూర్తి ప్రదాత మహాత్మా గాంధీజీ అని మాజీ సర్పంచ్ కరుకోల రమేష్ బాబు పాఠశాల విద్యా కమిటీ చైర్ పర్సన్ చింతాడ గున్నమ్మ అన్నారు. గురువారం జాతిపిత మహాత్మా గాంధీజీ 156 వ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోదూరు ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దలు గొర్లెల ఎర్రయ్య, చింతాడ లావన్య మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ మానవాళిని అత్యంత ప్రభావితం చేసిన గొప్ప నాయకులలో గాంధీజీ ముందు వరుసలో ఉంటారని అన్నారు. ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణ రావు, బాడాన రాజు మాట్లాడుతూ నేటి విద్యార్థులు, యువత గాంధీజీ శాంతి మార్గాన్ని అనుసరిస్తూ దేశభక్తితో భారత దేశ అభివృద్ధికి పాటుపడిన మహనీయుని ఘనమైన నివాళి కాగలదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుకోల రమేష్ బాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్ పర్సన్ చింతాడ గున్నమ్మ, గ్రామ పెద్దలు కరుకోల ధర్మేంద్ర, ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, బాడాన రాజు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ రఘుపతిరావు

విశాలాంధ్ర - మందస : ప్రతి ఒక్కరూ పర్యా వరణాన్ని పరిరక్షించుకోవాలని పవర్ గ్రిడ్ మేనేజర్ రఘుపతిరావు అన్నారు. శుక్రవారం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పలాస రామకృష్ణాపురం ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా జడ్పిహెచ్ఎస్ సొండిపూడిలో పదివేల రూపాయల విలువైన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ సుందర సాల్మన్, వి. వి. ఎస్.శెట్టి, చీఫ్ మేనేజర్, కె.రఘుపతిరావు, జె.ఇ, జి.రాంబాబు, జె.ఇ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వంశధార వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని వంశధార నదీ తీర ప్రాంతాలను ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి శుక్రవారం పరిశీలించారు. గత రెండు రోజుల నుండి ఒడిషాలోని కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు వంశధారకు పోటెత్తడంతో గురువారం రాత్రి నుండి వంశధార నదిలో సుమారు 80వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. దీనితో మండలంలోని తీర ప్రాంతాలైన గెడ్డవానిపేట, కొబగాం, మడపాం గోపాలపెంట గ్రామాలను ఎమ్మెల్యే, రమణమూర్తి సందర్శించి, గ్రామ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక వేళ వరద నీరు ఎక్కువైనట్లయితే అధికారుల సహకారంతో పునరావాస కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట సి.ఐ, ఎం.శ్రీనివాసరావు, నరసన్నపేట, జలుమూరు ఎస్.ఐలు, సిహెచ్.దుర్గాప్రసాద్, అశోక్‌బాబు, గ్రామస్థులు, అడపా చంద్రశేఖర్, నేతింటి వెంకట రమణ, బగ్గు గోవిందరావు, అడపా రజనీకాంత్, రావాడ కృష్ణ, కింజరాపు సత్యం, వెలమల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాల్లో మునిగిన వరి పంట

విశాలాంధ్ర - సోంపేట : పలాసపురం, బారువపేట రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల వరి పంట ముంపునకు గురి కావడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పలాసపురం రెవెన్యూ పరిధిలో బారువబట్టి, బారువపేట రెవెన్యూ పరిధిలో కంబ బట్టి బుధవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తూ సమీపంలో గల పంట పొలాల్లో కూడా నీరు విపరీతంగా ప్రవహించి పంటలను ముంచేయడంతో ఆయా గ్రామాలకు చెందిన రైతాంగం లబోదిబోమంటుంది. మహేంద్రగిరి కొండలపై కురిసిన విపరీతమైన వర్షాలతో మహేంద్రతనయ నది విపరీతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో అటు బారువ, ఇటు పలాసపురం గ్రామాల వైపు వచ్చే కాలువలు, బట్టిలు జోరుగా ప్రవహిస్తూ సమీప పంట పొలాలను కూడా ముంచెత్తాయి. దీంతో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కంబ బట్టిలో విపరీతంగా గుర్రపుడెక్క పేరుకు పోవడం, దానికి తోడు గత నెలలో వినాయకచవితి ఉత్సవాల అనంతరం భారీ విగ్రహాలను ఇందులోనే నిమజ్జనం చేయడంతో ప్రస్తుతం పైనుంచి వచ్చే వరద నీరు నేరుగా ప్రవహించక పొలాల మీదకు మళ్లుతుంది. పొలాల మీదకు మళ్లే నీరుతో బారువపేట, బారువ, లక్కవరం సమీప గ్రామాల్లో గల సుమారు వెయ్యి ఎకరాల పొలాలు నీట మునగడంతో ఏమి చేయాలో తెలియక రైతులు పడుతున్న ఆందోళన అంతా ఇంతా కాదు. కంబ బట్టిలో నీరు సక్రమంగా సముద్రానికి వెళ్లేందుకు ఉన్న ఆటంకాలను తొలగించాల్సిన ఉపాధి హామీ పథకం అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు గత వేసవిలో కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఎగువ నుంచి వస్తోన్న వరదనీరు ముందుకు వెళ్లక పంట పొలాలను ముంచేస్తుంది. ఈ ముంపు మరో రెండు రోజులు కొనసాగితే వరి పంటలు నాశనమవుతాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సోంపేట మండలం నుంచి కవిటి మండలం బీలబట్టిలో కలిసే కంబ బట్టి వరదనీరు కవిటి మండలం ఇద్దివానిపాలెం వద్ద సముద్రంలో కలవాల్సి ఉంది. ఆ గ్రామం వద్ద పొగురు తీస్తే తప్పా నీరు సముద్రంలో కలిసే పరిస్థితి లేదు. శుక్రవారం సాయంత్రం వరకు అధికారులు పరిస్థితులను గమనించడం తప్పా వరదనీటిని మళ్లించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతాంగం తీవ్రంగా విమరిస్తోంది. శనివారం ఉదయం నాటికైనా వరదనీరు మళ్లించే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రంగాన్ని రైతులు కోరుతున్నారు. వరి పంట ముంపు గ్రామాలను తహశీల్దార్ అప్పలస్వామి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు టి.భవానీశంకరరావు, మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి, ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సూర్యప్రకాష్ శుక్రవారం పరిశీలించారు.

ఉపాధి హామీ పనులు గుర్తించండి

విశాలాంధ్ర - నరసన్నపేట : రానున్న 2026-27వ సంవత్సరానికి గాను మేజర్ పంచాయితీ పరిధిలో ఉపాధి హామీ పనులు గుర్తించాలని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్, అప్పలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయితీ ఆవరణలో ఉన్న గాంధీ కళా మండపంలో గ్రామ సభ కార్యక్రమంలో పంచాయితీ ఈ.ఓ, పి.ద్రాక్షాయిణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో సాగునీటి కాలువలు, ఇంకుడు గుంతలు, పొలాల్లో నాటేందుకు ఉద్యానవన మొక్కలు తదితర పనులకు చెందిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అనంతరం పట్టణంలో శ్రీలక్ష్మీ నగర్ కాలనీలో నిల్వ ఉంటున్న వర్షపునీరు సమస్యను పరిష్కారం చేయాలని కాలనీ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్, గొద్దు చిట్టిబాబు, మాజీ వైస్ సర్పంచ్‌లు, కెసిహెచ్‌బి.గుప్తా, పొట్నూరు కృష్ణప్రసాద్, వార్డ్ మెంబర్లు, రఘుపాత్రుని శ్రీధర్, బి.ఎల్.శర్మ, బోయిన సతీష్, బతకల సంతోషి, గొలివి రామారావు, నేతింటి సింహాచలం, ఎంపిటిసిలు, వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు, మాజీ ఎంపిటిసిలు, జామి వెంకటరావు, పీస కృష్ణ, పంచాయితీ కార్యాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్డ గేయామృతకు ఘన సన్మానం

విశాలాంధ్ర - టెక్కలి : గత ప్రభుత్వం క్రీడాకారులు పై చూపిన నిర్లక్ష్యం కారణంగా ఒక గ్రామీణ ప్రాంత క్రీడాకారిణి జాతీయ స్థాయి కి వెళ్లడమే గొప్ప అది కూడా రెండు యుద్ధ క్రీడల్లో ఒకటి టైక్వాండో మరొకటి బాక్సింగ్ 2023 సంవత్సరంలో రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటిల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం, మరోపక్క బాక్సింగ్ లో అల్ ఇండియా యూనివర్సిటీ పోటిల్లో తన సత్తా చూపించిన ఘనత మరెవరో కాదు టెక్కలికి 05 కిలోమీటర్లు దూరంలో గల బన్నువాడ గ్రామానికి చెందిన బొడ్డ గేయామృత. తల్లిదండ్రులు నాగేశ్వరావు మరియు లక్షమమ్మ ప్రోత్సాహంతో చిన్ననాటి నుండే స్థానిక టైక్వాండో మరియు బాక్సింగ్ కోచ్ నర్సిపురం శేఖర్ వద్ద శిక్షణ పొందింది, శ్రమకు తగ్గ ఫలితం లేకపోగ కనీసం గుర్తింపు కూడా దక్కని పరిస్థితి, కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తను దత్తతు తీసుకున్న గ్రామానికి వచ్చి ఆనాడు క్రీడాకారిణి కూడా దక్కని గౌరవం నేడు మంత్రి అచ్చెన్నాయుడు ఊరు వెళ్లి ప్రజలు సమక్షంలో శాలువా కప్పి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపి తనదైన శైలో బొడ్డ గేయామృత ను గౌరవించారు.

ముంపు ప్రాంతాలను సందర్శించిన జిల్లా వైద్యాధికారి

విశాలాంధ్ర - హిరమండలం : మండలం లోని అంబావిల్లి, రెల్లివలస, అక్కరాపల్లి గ్రామాలను జిల్లా వైద్య శాఖాధికారి డా. కే అనిత శుక్రవారం సందర్శించారు. ముంపు ప్రాంతాలను పరిశీలించి తగు జాగ్రత్తలను సూచించారు. హిర మండలం పీహెచ్‌సి పరిధిలోని అంబావిల్లి, రెల్లివలస, అక్కరపల్లి, గ్రామాలలో కలెక్టర్ ఆదేశాలు మేరకు వైద్య శిబిరంను డా. పదాల సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిబ్బంది వి హెచ్ ఎస్ ఆర్ ఆదిలక్ష్మి, హెచ్ వి రోజారమణి, ఆరోగ్య సహాయకులు- విఎంవి రాజు, బిజ్యోతి, ఎంఎల్ హెచ్ పివినీత, ఆశ కే ఈశ్వరమ్మ పాల్గొన్నారు. వీరితో పాటు సచివాలయం సిబ్బంది, పోలీస్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రయోజనం

విశాలాంధ్ర–కవిటి: వస్తు సేవల పన్నులో (జీఎస్టీ) సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం సమకూరిందని ఎంపీడీవో ఎల్. త్రినాథ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి ఎంపీడీవో కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల సభ్యులు, ఎన్ఆర్జీఎస్ సిబ్బంది, వేజ్ సేకరనకు, వ్యాపారస్తులకు జీఎస్టీ సంస్కరణలు, సూర్యఘర్ పై అవగాహన కల్పించారు. వీటిని మీరు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వై. వరప్రసాద రావు,ఎంఈవో ధనుంజయ మజ్జి,ఏపీఎం గోవింద రావు,ఏపీవో మోహన్, వెలుగు కార్యాలయంత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో తీవ్ర నష్టం

- ముంపుకు గురైన వరి పంట పొలాలు
- చెరువులకు..సాగునీటి కాలువలకు గండ్లు
- ఇంకా తగ్గని వరద ప్రవాహం..

విశాలాంధ్ర–పలాస/మందస : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మునుపెన్నడూ లేని విధంగా గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పలాస నియోజకవర్గం అతలాకుతలమైంది. మందస.. పలాస..వజ్రపుకొత్తూరు మండలాల్లోని గ్రామీణ పల్లెల్లో రోడ్లు వరద ప్రవాహానికి ధ్వంసం అయ్యాయి. చెరువులు..సాగునీటి కాలువలకు భారీగా గండ్లు పడ్డాయి. దీంతో నియోజకవర్గ పరిధిలో వేలాది వరి పంట పొలాలు ముంపుకు గురయ్యాయి. ఇంకా వరద ప్రవాహం ఉధృతంగా ఉంది. మందస మండలం పరిధిలో సునాముది ప్రధాన కాలువలకు,పిల్ల కాలువలకు పలుచోట్ల గుండ్లు పడ్డాయి. కళింగదళ్ రిజర్వాయర్ కు సంబంధించిన పిల్ల కాలువలు పలుచోట్ల గుండ్లు పడ్డాయి. చెరువులకు కాలువలకు గండ్లు పడటంతో వరి పంట పొలాలకు నీటి ప్రవాహం ఎక్కువై ముంపుకు గురయ్యాయి. పలు గ్రామాల రహదారులు కు గండ్లు పడ్డాయి. రోడ్లు ఆనవాళు కోల్పోయే స్థితికి చేరుకున్నాయి. 2018 అక్టోబర్ 10న సంభవించిన తితిలి తుఫాన్ దాటికి నియోజకవర్గ స్థాయిలో సాగునీటి వనరులైన చెరువులు, కాలువలు, పరుపులు, మధుములు ధ్వంసం అయ్యాయి. అప్పట్లో నీటి వనరులకు భారీగా నష్టం వాటిల్లింది. తుఫాను వచ్చి ఆరు సంవత్సరాలు పైబడినప్పటికీ ఇప్పటి వరకు నీటి వనరులకు ప్రభుత్వ పరంగా మరమ్మతులు పూర్తిగా జరగలేదు.అసలు నీటి వనరులు అభివృద్ధి కోసం పాలకులు పూర్తిగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు రైతులు నుంచి వినిపిస్తున్నాయి. తితిలి తుఫానులో నష్టం జరిగిన నీటి వనరుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గత 7సంవత్సరాల నుంచి రైతులు..రైతు సంఘాలు కోరుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోలేదు.మళ్లీ ఇప్పుడు బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సాగునీటి వనరులైన కాలువలు..చెరువులు మధుములు పరుపులకు భారీగా నష్టం వాటిల్లింది. ప్రస్తుతం జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. గతంలో తితిలి తుఫాన్ సమయంలో జరిగిన నష్టాలను అప్పట్లో ఇరిగేషన్ శాఖ అధికారులు అంచనా వేసి అభివృద్ధికి ప్రతిపాదన చేసిన ప్రభుత్వ పరంగా..ప్రజా ప్రతినిధులు పరంగా స్పందన పూర్తిగా కొరవడింది. రైతాంగం నుంచి రెండు పంటలకు సంబంధించిన నీటి తీరువా పన్నులను ప్రభుత్వం వసూలు ప్రతి ఏడాది చేస్తున్నారు. కానీ రైతుల సాగునీటి వనరులైన చెరువులు, కాలువలు మరమ్మతులు మాత్రం జరగడంలేదని రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు,ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి నీటి వనరుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్తంభించిన జన జీవనం.. తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. పలు కాలువల్లో పోటెత్తింది. పలాస మండలంలో వరహాల గెడ్డ కు వరద నీరు ప్రవహిస్తుండడంతో కంబిరిగాం, బ్రాహ్మణతర్ల రహదారులలో రాకపోకలు బంద్ అయ్యాయి. అలాగే ఈ రహదారులలో ఉన్న పండా శాసనం, కేసు పురం, కరజాడ, ఈదురపల్లి, కరజాడ, జడ్యాడ, టెక్కలి పట్నం, గంగువాడ, చినంచల, పెదంచల, గోదావరి లతో పాటు మరో 15 గ్రామాలకు పలాస తో రాకపోకలు నిలిచిపోయాయి. దసరా కావడంతో స్వగ్రామాలకు చేరుకుంటున్న వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వరహాల గెడ్డపై కంబిరిగాం వద్ద వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం పెద్ద బడాం దగ్గర వరద ఉధృతికి రహదారి కొట్టుకుపోవడంతో పలాస నుండి వజ్రపుకొత్తూరుకు రాకపోకలు స్తంభించిపోయాయి. బెండి, నగరంపల్లి రహదారిలో వరద నీటి ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోయాయి.

48 గంటల పాటు అంధకారం : గురువారం ఉదయం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు టెక్కలి పట్నం పరిసరాల గ్రామాలు అంధకారంలో కూరుకుపోయాయి. బుధవారం, గురువారాల్లో భారీ వర్షాలు కారణంగా విద్యుత్ స్థంభాలు నేలకు ఒరిగాయి. దీంతో గురువారం రాత్రి కరెంట్ లేకపోవడంతో జనం తీవ్ర ఇబంధులు ఎదుర్కొన్నారు. జంక్షన్ లో వ్యాపారుల ఫ్రిడ్జ్ పనిచేయకపోవడంతో కూల్ డ్రింక్స్, కేక్, ఐస్ క్రీంలు పాడై పోయాయి. కూరగాయలు కూడా కుళ్ళి పోయాయి. విద్యుత్ పునరుద్ధరణ పనులు ఏఈ నాగభూషణం నేతృత్వంలో పనులు చేపట్టి సాయంత్రం కు పునరుద్ధరించారు.

వాయుగుండం ప్రభావంతో పంట పొలాల్లోకి వరదనీరు

- ముంపునకు గురైన వందలాది ఎకరాలు పంట పొలాలు
- లబోదిబోమంటున్న లోతట్టు ప్రాంతాల రైతులు

విశాలాంధ్ర–సంతబొమ్మాలి : బంగాళాఖాతంలో వాయుగుండం ఫలితంగా సంపబొమ్మాలి మండలంలో గల వందలాది ఎకరాలు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షాలకు ఏటిపరలోకి వరద నీరు చేరింది. ఈ తంపరచుట్టు మరువాడ మేఘవరం కొల్లిపాడు గోదలం బోరుభద్ర కాకరపల్లి దండు గోపాలపురం నౌపడ సందిపేట సున్నా పెల్లి మూలపేట మర్రిపాడు భావనపాడు కోటపాడు, ఆకాశలపురం హనుమంతు ఆకాశలకవరం హనుమంతు నాయుడుపేట పంచాయతీలకు చెందిన పంట పొలాలు వరద తాకిడికి గురయ్యాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. రెండు రోజులుగా వరద నీరు పొలాల్లో ఉండిపోవడంతో వరిచేలు కుళ్ళిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. కొన్నిచోట్ల చెరువులు, వంశధార కాలువ నీరు ప్రవహించడంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. వర్షాలు ముందు వరకు తీవ్రమైన ఎండలకు నీరు లేక శ్రమపడి వరినాట్లు వేసామని ప్రస్తుతం వరద తాకిడికి గురైనష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు. మండల తాసిల్దార్ హేమసుందర్ ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. నౌపడ వైయస్సార్ కాలనీలోకి వరద నీరు చేరడంతో, టెక్కలి వంశధార శాఖ డీఈతో పాటు తాసిల్దార్ వెళ్లి ప్రజలను అప్రమత్తం చేసి మూడు ఇళ్లల్లో గల కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించే చర్యలు చేపట్టారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర–ఎల్.ఎన్.పేట : గత రెండు రోజులుగా వాయుగుండం కారణంగా ఒడిస్సాలో కురుస్తున్న వర్షాల వలన వంశధార నదిలోకి ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా హిరమండలం, ఎల్ ఎన్ పేట మండలాల్లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వంశధార నదీతీర ప్రాంతాలైన, హిరమండలం, దుర్బలాపురం, కొండ రాగోలు, ఎల్ ఎన్ పేట మండలం దబ్బపాడు,వాడవలస మిరియాపల్లి గ్రామాల లో పర్యటించి ప్రజలతో మాట్లాడి నది తీర ప్రాంతాల ప్రజలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు. అలాగే నది తీరా గ్రామాల ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని సంబంధిత అధికారులు స్పందించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే కొత్తూరు, హిరమండలం మండలాల్లో పలు గ్రామాల్లో వరదనీరు చేరి పంట పొలాలు మునిగాయి దీంతో సంబంధిత అధికారులు నీట మునిగిన పంట పొలాలని పర్యవేక్షించి జిల్లా అధికారులకు నివేదిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఎల్ ఎన్ పేట తహసిల్దార్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మరింత ఊరట

- జీఎస్టీ తగ్గింపు ద్వారావిజన్ 2047 సాకారం
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర –శ్రీకాకుళం టౌన్: జీఎస్టీ తగ్గింపు ద్వారా వినియోగదారులకు మరింత మేలు చేకూరుతుందని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జీఎస్టి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీ ను కేవలం రెండు స్లాబులకే పరిమితం చేయడం ద్వారా వినియోగదారులకు మరింత మేలు చేకూరుతుందన్నారు. కేవలం 5, 18 పర్సెంట్ జీఎస్టి లు మాత్రమే ఇప్పుడు ఉన్నాయని తద్వారా అనేక నిత్యవసర వస్తువులకు జీరో పర్సెంట్ జీఎస్టి కల్పించారని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, వ్యాపారస్తులు తగ్గింపు జీఎస్టి వివరాలను విధిగా వాణిజ్య కేంద్రాల ముందు ప్రదర్శన చేసి వినియోగదారులకు తెలియజేయాలని కోరారు. తగ్గింపు జీఎస్టి ద్వారా మరింత ఆదాయం పెరిగి సామాన్యులు మరింత అభివృద్ధి కి అవకాశం కలుగుతుందన్నారు. సాఫల్యతకు తగ్గింపు జీఎస్టీ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల వ్యాపారస్తులు తగ్గింపు జీఎస్టి అవగాహన సదస్సులలో పాల్గొనేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జీఎస్టి అవగాహన సదస్సుల విజయవంతానికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని వ్యాపారస్తులకు తెలియజేస్తూ అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎస్టి నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ జీఎస్టీ అధికారులు, పరిశ్రమల శాఖ ఏడి, డ్రగ్ ఎడి, ఏడి హ్యాండ్లూమ్స్, కార్మిక శాఖ కమిషనర్, రఘు అసోసియేషన్ ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, ఫిదా మెడికల్ షాపుల ప్రతినిధులు, పలు వ్యాపార వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటా!

విశాలాంధ్ర –నరసన్నపేట: మండలంలోని వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని కంబకాయ, కరగాం క్లస్టర్‌లకు సంబంధించి, కంబకాయ గ్రామంలో కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.కృష్ణ చైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసిపి కార్యకర్తలను, నాయకులను లక్ష్యంగా చేసుకొని, వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి నాయకులు, చింతు రామారావు, రాజాపు అప్పన్న, లుకలాపు రవికుమార్, రావాడ రామారావు, సతివాడ రామినాయుడు, బుద్ధల రాజశేఖర్, బగ్గు రమణయ్య, దండి జయప్రకాష్, సురంగి నర్సింగరావు, బార్ల వేణుగోపాలరావు, నేతింటి రాజేశ్వరరావు, పాగోటి భరత్, తోట భార్గవ్, దుప్పట్ల పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే గోండు శంకర్

విశాలాంధ్ర –శ్రీకాకుళం రూరల్ : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పలు గ్రామాలు వరద ముంపుకు గురయ్యాయి. శ్రీకాకుళం నియోజవర్గ పరిధిలోని పలు ముంపు గ్రామాలను ఎమ్మెల్యే గోండు శంకర్ శుక్రవారం పరిశీలించారు. ప్రభావిత గ్రామాలైన ,కరజాడ బైరి గార మండలం బురవెల్లి ఆరింగిపేట కళింగపట్నం తాన్నాయ పేట ముంపు గురైన తదితర గ్రామాలను ఆర్డీవో ప్రత్యూష తో కలిసి పరిశీలించారు. అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేసి వరద ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వరద ప్రభావం వలన నష్టపోయిన పంటలకు గాను ప్రభుత్వమే ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం మండల అధికారులు ఎన్డీఆర్ఎఫ్ సహాయక సిబ్బంది సమయంతో బాధితులకు తక్షణ సహాయం అందించారు. ఈయన వెంట కూటమి నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పూర్తి

- యుద్ధ ప్రాతిపదికన పనిచేసిన విద్యుత్ సిబ్బంది

విశాలాంధ్ర–శ్రీకాకుళం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా విజయదశమి నాడు జిల్లాలో సంభవించిన తీవ్ర పెనుగాలులు, అత్యధిక వర్షపాతం వలన విద్యుత్ మౌలిక సదుపాయాలకు భారీ నష్టం వాటిల్లింది. ఈ ప్రకృతి వైపరీత్యంలో జిల్లాలోని 27 గ్రామాలలో 74 విద్యుత్ స్తంభాలు నేల మట్టమయ్యాయి. దాదాపు 350 మీటర్ల విద్యుత్ లైన్లు తెగిపడగా, ఒక 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 4 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటం వలన కూడా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా మొత్తం అంధకారంలోకి వెళ్లినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ శాఖ తక్షణమే స్పందించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. పనులకు సంబంధించి పురోగతిపై సూపరింటెండింగ్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ముందుగానే 600 మంది విద్యుత్ సిబ్బందిని, 300 మంది కాంట్రాక్ట్ వర్కర్స్‌ను సిద్ధం చేయడంతో అంతరాయం కలిగిన ప్రాంతాలలో సిబ్బంది హుటాహుటిన స్పందించగలిగారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో పునరుద్ధరణ పనులు చేపట్టి, జిల్లాలో 100 శాతం విద్యుత్ సరఫరాను విజయవంతంగా పునరుద్ధరించడం జరిగిందని కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో సిబ్బంది చేసిన కృషిని ఆయన అభినందించారు. చివరగా విద్యుత్ వినియోగదారులు భద్రతా సూచనలు పాటించాలని, ముఖ్యంగా తడిగా ఉన్న స్తంభాలను లేదా వేలాడుతున్న విద్యుత్ వైర్లను తాకవద్దని ఆయన కోరారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో లోపాలు లేదా తెగిపడిన వైర్లు గమనించినట్లయితే, వెంటనే సంబంధిత డివిజన్ హెల్ప్ డెస్క్‌లకు (శ్రీకాకుళం: 9490610045, పలాస: 9490610050, పాలకొండ: 08945-241084) లేదా ఏపీఈపీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబరు 1912కు సమాచారం ఇవ్వాలని నాగిరెడ్డి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర–జలుమూరు : గత మూడు రోజులుగా అకాల వర్షాలు పడడం ద్వారా జిల్లాలో అనేక ప్రాంతాలలో పంట పొలాలు ముంపుకు గురి అయ్యాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలంలో ఉన్న అచ్యుతాపురం, కొమనాపల్లి గ్రామాలలో సిపిఐ బృందం ముంపుకు గురైన పంట పొలాలను పరిశీలన చేశారు, ఈ సందర్భంగా కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అధికంగా వర్షాలు పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని పంట పొలాలు ధ్వంసం అయ్యాయని అన్నారు. వంశధార నది ఉగ్రరూపం దాల్చడంతో కొమనాపల్లి గ్రామంలో వందలాది ఎకరాలు ముంపుకు గురి అవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యవసాయ శాఖ మంత్రి సంబంధిత అధికారులు పంపించి నష్టపోయిన రైతులకు పంట బీమా, నష్ట పరిహారం చెల్లించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి. కర్ణ వీరుడు లవడు వసంత్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పర్యటించిన జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర –జలుమూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావ ద్రోణి కారణంగా జలుమూరు మండలం వంశధార నది తీరప్రాంతాల్లో గల కొమనాపల్లి అచ్యుతాపురం గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సంయుక్తంగా పర్యటించారు. వరద ప్రభావితం వలన వచ్చే నష్టాలు ఇతర విషయాలపై వారు ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాల ప్రభుత్వం అధికార యంత్రాంగం ఆదుకుంటుందని వారు ప్రజలతో అన్నారు. అలాగే నర్సంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందితో తీర ప్రాంత గ్రామాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. వారితో పాటు తాసిల్దార్ జన్ని రామారావు, ఇన్చార్జ్ ఎంపీడీవో వి ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ తాడేల శ్రీకాంత్, మండల ప్రత్యేక అధికారి హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్థానిక అధికారులు పలువురు పాల్గొన్నారు.

జాతిపిత జగతికే ఆదర్శం

ఘనంగా గాంధీజీకి నివాళులు

విశాలాంధ్ర –కోటబొమ్మాళి: బ్రిటిష్ వారి బానిసత్వం నుంచి భారతీయులను విముక్తి చేసి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషించిన మహాత్మా గాంధీ జగతికే ఆదర్శమని గాంధీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సకల భక్తుల శ్రీనివాసరావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని కోటబొమ్మాళి లోని పాత బస్టాండ్ వద్ద గాంధీజీ విగ్రహానికి రోట రాక్ట్ క్లబ్ ఫాస్ట్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. గాంధేయ మార్గం అందరికీ ఆదర్శం అని, గాంధీజీ సూచించిన శాంతి, అహింస, సత్యం మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు మనం అర్పించే నివాళి అవుతుందని పలువురు పేర్కొన్నారు. గాంధీ సన్మార్గంలో ప్రయాణిస్తూ నమ్మిన సిద్ధాంతాలను, విలువలను నిబద్ధతతో ఆచరించడం వల్ల ఆయన కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం అయ్యాయని తెలిపారు. అహింసతోనే అఖండ భారత వానికి స్వాతంత్రం తీసుకొచ్చారని.. పోరాటానికి గాంధీజీ ఎంచుకున్న శాంతి, అహింస మార్గం భారతీయులకే కాదు.. యావత్ ప్రపంచానికి మార్గదర్శంగా నిలిచిందన్నారు. మహాత్మా గాంధీ జీవిత విషయాల నుండి మనం నేర్చుకున్న అంశాలను భావితరాలకు తెలియజేయాలని, అలాగే తమ నుండి ఎదుటివారికి తమ వంతు సాయం చేద్దాం.. ఎవరికీ నష్టం చేయకూడదు అన్నారు. మనమంతా గాంధీ చూపిన మార్గంలో నడవాలని సూచించారు. మహానుభావులు చూపిన మార్గాలను తప్పకుండా అనుసరించి, వారు చేసిన త్యాగాలు యువతకు ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ సేవా సమితి ఉపాధ్యక్షులు సుసరాపు సూరిబాబు, సకల భక్తుల త్రినాధరావు, కోరాడ సుబుద్ధి, సకల భక్తుల చాణుక్య, జర్నలిస్ట్ తలగాపు వెంకటరమణ, శిరసాన శ్రీని వాసరావు, నౌ గాపు నాగరాజ్, కూన భాస్కర్, జామి శేఖర్, సిహెచ్. శ్రీనివాస్, రఘుపాత్రుని రామారావు నౌ వడ కామేశ్వరరావు, సకల భక్తుల నీలకంఠేశ్వరరావు, కోరాడ సాయిరాం, మజ్జి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటిక భూములు పరిరక్షించండి

విశాలాంధ్ర–సరుబుజ్జిలి : సరుబుజ్జిలి గ్రామంలో స్మశాన వాటికకు సరియైన్ సదుపోయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే కననం చెయ్యాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. దీనిపై సమస్యలు వివరంచటానికి స్థానిక శాసనసభ్యులు మరియు పి.యు.సి. చైర్మన్ అయినటువంటి కూన రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో సరుబుజ్జిలి పంచాయితీ సభ్యులు పలువురు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. స్మశాన వాటిక భూములు పరిరక్షణ కోసం చుట్టు రక్షణ గోడ నిర్మించాలని, సరుబుజ్జిలి జడ్పీహెచ్ హైస్కూల్ రూముల్లో ఫ్లోరింగ్స్ పెచ్చులుడిందని, రిఫ్లోరింగ్ చెయ్యాలని ఇలా పలు సమస్యలను ప్రస్తావించారు. దీనిపై కూనా రవికుమార్ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చినట్లు ఆమదాలవలస ఏ.ఎమ్.సి డైరెక్టర్ ప్రతినిధి యండ రామారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరియు జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు గుర్రాల చిన్న బాబు మరియు పలువురు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

ఆమ్మో ఆర్టీసీ ఫ్రీ బస్సు

- మగ వారికి సిటే కరువు
- మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్సులు

విశాలాంధ్ర–కొత్తూరు : కూటమి ప్రభుత్వం మహిళాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకార్యాన్ని కల్పించిన తరువాత రోజురోజుకు మహిళా ప్రయానికుల సంఖ్య పెరుగుతుంది ఏ బస్సు చూసినా ఎక్కేవారు. దిగేవారు మహిళా లే కనిపిస్తారు. కష్టసుఖాల్లో బంధువులకు పరామర్శలు. దూరంగా ఉన్న ఆలయాల సందర్శనలు బాగా పెరిగాయి బస్సులో వెళ్తున్న మగ వారికి స్టాండింగ్ తప్పా సిట్లే కరువైనాయి అన్న విమర్శలు మగ ప్రయానికులు నుండి వినిపిస్తున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం తాము కాదనడం లేదు కానీ ప్రయానికుల రద్దీకి తగ్గట్టు బస్సుల సంఖ్య పెంచాలని పలువురు. ఏపిఎస్ఆర్టిసిని ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు.

కొట్టుకుపోయిన రహదారి

విశాలాంధ్ర –వజ్రపుకొత్తూరు : వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి పెద్దబడాం వద్ద తారు రోడ్ కొట్టుకుపోయింది. శివరాంపురం వెళ్ళే గ్రావెల్ రోడ్, సీతాపురం వద్ద తారు రోడ్ పూర్తిగా జలమయం అయ్యాయి.అక్కుపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రహరీ గోడ కూలింది.హుకుంపేట లో కి వరద నీరు చొచ్చుకు పోవడంతో ఫైర్ ఇంజన్ సాయంతో వరద నీటిని తొలగించారు.చినడోకులపాడు చెరువు కు గండి పడటంతో చెరువు నీరు పంట పొలాలపై పడింది.శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అక్కుపల్లి, నగరంపల్లి ,సీతాపురం, గుల్లపాడు, బేండి తదితర గ్రామాలలో పర్యటించారు.నోటిలో మునిగిన పంట పొలాలు పరిశీలించారు.రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.శివరాంపురం నుంచి రాకపోకలు సాగించే కంకర రోడ్ నీటితో నిండిపోవడంతో తాడు పట్టుకుని సుమారు అర కిలోమీటరు యువకుడు నడుస్తున్నారు.తహసీల్దార్ సీతారామయ్య, డిప్యూటీ తహసీల్దార్ శివరాంపురం, సీతాపురం, పెద్దబడాం రహదారులను పరిశీలించారు.

వంశధార వరద తీర ప్రాంతాల్లో వైసీపీ నేతలు పర్యటన

విశాలాంధ్ర–కొత్తూరు : వంశధార పరివాహక ప్రాంతాలైన సిరుసువాడ కుంటి భద్ర వసప నివగాం మాతల గ్రామాలు మరియు ముంపు పొలాలును పాతపట్నం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శ్రీమతి రెడ్డి శాంతమ్మ ఆదేశాల మేరకుకొత్తూరు మండల వైయస్సార్సీపి అధ్యక్షులు గండివలస ఆనందరావు ఆధ్వర్యంలోనియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు అగతముడి నాగేశ్వరరావు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గుడి బండి పోలయ్య మాజీ సర్పంచ్ దూళి అప్పన్న ఎంపీటీసీ వనము లక్ష్మీనారాయణ పాపారావు హరీష్ నారాయణరావు బొమ్మాళి నగేష్ సిమ్మా ని పకీరు తదితరులు లోతట్టు ముంపు ప్రాంతాలను పర్యటించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం విద్యార్థులు

విశాలాంధ్ర –కవిటి: విశాఖపట్నం జిల్లా నర్సిపట్నం వేదికగా ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల సాఫ్ట్బల్ చాంపియన్ షిప్–2025 పోటీలకు కవిటి మండలం మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 5 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.వైకుంఠ రావు తెలిపారు.వీరి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. వీరి విజయానికి కృషి చేసిన వ్యాయమ ఉపాధ్యాయులు రవి కుమార్ మహంతి, ఎం. తోటరావులను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గత వైభవాన్ని పునరుద్ధరించాలి

- వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో హారిక రాజు ప్రథమ స్థానం

విశాలాంధ్ర–ఆమదాలవలస: వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆమదాలవలస కీర్తిని దేశ పుటలలో లిఖించే విధంగా యువత రాణించాలని వైసిపి ఆముదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతా రవికుమార్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విజేతలను సత్కరించి అభినందించారు. ఏలూరు ఇండోర్ స్టేడియం లో జరిగిన రాష్ట్రస్థాయి 29వ విభాగం పోటీల్లో 53 కేజీల విభాగంలో కొర్లకోటకు చెందిన సిహెచ్ హారిక రాజ్ ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ఇటీవల పొందూరులో జరిగిన 28వ జిల్లా స్థాయి పోటీలలో సీనియర్ విభాగం 110 కేజీల్లో ఎస్ నరేంద్ర మొదటి స్థానం, 110 కేజీల జూనియర్ విభాగంలో ఎస్ కిరణ్ మొదటి స్థానంలో నిలిచారు. 48 కేజీల మహిళల విభాగంలో రావికండి పేటకు చెందిన పుట్టా సాయి లక్ష్మి ప్రథమ స్థానం, అదే గ్రామానికి చెందిన 50 కేజీల విభాగంలో ఎం చిన్నమనాయుడు, 56 కేజీల విభాగంలో కె. యశ్వంత్ లు మొదటి స్థానాలను గెలుపొందారు. రావి కండిపేట జిమ్ములో సిహెచ్ రాజ్యలక్ష్మి కోచ్ ఆధ్వర్యంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని ఆముదాలవలస పట్టణానికి వారు బహుమతులను అందించారు. బహుమతి పొందిన అందరిని వైసీపీ నాయకులు డాక్టర్ చింతాడ రవికుమార్ అభినందించారు.

ధర్మ పరిరక్షణే ప్రధాన ధ్యేయం

విశాలాంధ్ర–కవిటి: ధర్మ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యకర్తలు పని చేయాలని ప్రముఖ వక్త, శ్రీకాకుళం జిల్లా భౌతిక ప్రముఖ్ ఉపాధ్యాయులు తెలుకుల ధర్మరాజు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది విజయదశమి ఉత్సవాలను శుక్రవారం కవిటి మండలం కపాసుకుద్ది గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఐక్యత కోసం ఆర్ఎస్ఎస్‌కు డాక్టర్ హెడ్గేవార్ 1925లో దసరా రోజున ప్రారంభించారని అప్పటి నుంచి దేశంలో నిత్యశాఖ ద్వారా అనేక మంది యువకులను దేశభక్తులుగా తయారు చేస్తూ జాతీయవాద సిద్ధాంతం ద్వారా ఆదర్శ కుటుంబ వ్యవస్థ, సామాజిక సమరసత పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ పౌరవిధులు, నీటి ఆవస్యకత గురించి పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల అధికారి బడే రామారావు, ముఖ్యఅతిథి కాయ భీమసేన, విభాగ సహకార ఉపాధ్యాయులు కర్రి లింగరాజు, కార్యవాక బడే లోకుదాస్, స్వయం సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.